# అతిథి ఆగమనం

రచన:
శ్రీ. ఎస్. ముద్దుకృష్ణ.

అప్పుడే భోజనం పూర్తి చేసుకువచ్చిన మూర్తి పడక కుర్చీలో కూర్చుని ఆ వేళ పేపరు చూస్తున్నాడు. భారతి వచ్చి, 'ఇదుగోండి మీకో ఉత్తర మొచ్చింది' అంటూ అందించింది. ఆత్రుతగా అందుకున్నాడు.

'ఏమిటా ఆత్రం' ? అంది.

'నాకెందుకో చిన్నప్పటినుంచి ఉత్తర మొచ్చిందంటే చాలు ఉత్సాహం ఉరక లేసుకొస్తుంది.'

'మీకు ప్రతి విషయాన్ని వింతగా చూడ్డం అలవాటేనా. ఆ, నాకు లోపల పనుంది' భారతి లోపలికెళ్ళి పోయింది.

ఉత్తరం చదువుకున్నాడు. ఆనందం అవధులు దాటింది. సంతోష సాగరం లో మునిగిపోయాడు. నిమషం ముందు నిశ్చలంగావున్న మూర్తి బుడుంగున అలా మునిగి పోయాడే అని ఆశ్చర్యపోతున్నారా? పోకండి. వివరాలు నే చెబుతా వినండి. పాపం అతనలా మునిగి పోతున్నా, అయ్యోపాపం నిండు మనిషి నిలువునా మునిగి పోతున్నాడని జాలిపడి ఎవరూ ఒడ్డుకు చేర్చలేదు.

కాని, వాళ్ళముద్దులకొడుకు బాబిగాడు వూరుకున్నాడా! వాడు ఆరున్నొక్కరాగం అందంగా ఆలపించాడు వున్నట్టుండి. మూర్తి గబుక్కున యీలోకంలో పడ్డాడు. పడ్డందుకేమయినా దెబ్బలు తగిలాయా అని గాబరా పడకండి. నేను మీకు హామీ యిస్తున్నాగా దెబ్బలు తగలలేదని, పడ్డవాడు వూరుకున్నాడా గబగబాపోయి, బాబిగాడ్ని ఎత్తుకుని, 'ఏరా బాబు? ఏం అయిందిరా? ఏంటి? ఏమన్నా తగిలిందా?' ప్రశ్నల పరంపర కురిపించాడు వాడిమీద.

'ఏమిటండీ. వాడ్ని అలా ఏడపిస్తారు' అన్నది, అప్పుడే పనిపూర్తిచేసుకొచ్చిన భారతి. భారతికి బాబిగాడ్ని అందించాడు మూర్తి. భారతిదగ్గరకు రాగానే ఏడ్పాపేసాడే' అన్నాడు మూర్తి.

అన్నట్టుత్తరం సంగతింకా చెప్పలేదు కదూ? అది మూర్తి ప్రియమిత్రుడు రఘు వ్రాసినది. తనొక వారం రోజులలో బయలుదేరి అక్కడకు రాబోతున్నట్లు వ్రాసాడు. అందువల్లనే మూర్తి బ్రహ్మాండంగా బ్రహ్మానందపడిపోయాడు.

'ఎప్పుడొస్తాడా' అని రోజులు లెక్కవేసుకొన్నాడు. ఇంక మూడురోజులు. అంటే యివాళ, రేపు, ఎల్లుండి కాక ఆ తరువార రోజన్నమాట. తన ప్రియమిత్రుడు, పాతస్నేహితుడు, రఘు తనదగ్గర వుంటాడన్నమాట. ఎన్నాళ్ళకెన్నాళ్ళకు' అనుకున్నాడు.

'ఛ, యింతమంచి వుత్తరము యింత ఆలశ్యంగా యిస్తుందా భారతి. అసలు భారతకి బుద్ధిలేదు.' చిరాకుపడ్డాడు. 'భారతీ, యీ చక్కటి వుత్తరాన్ని ఎందుకాలస్యంగా యిచ్చావు? అని అడిగాడు, తప్పంతా నీదేనన్నట్లు, అధికారమంతా నాదేననట్లు.

'అదేమిటండీ, పనిలోవుండి మరచిపోయాను' అంది భారతి.

'అయినా, నీకు శిక్షవిధించాల్సిందే'

ఏం శిక్షవిధిస్తారు ? చిలకలా కిలకల లాడింది. మూర్తి మనస్సులో మల్లెల జల్లు కురిసింది.

నిద్రపోవాలని పడుకొన్నా నిద్రపట్టలేదు మూర్తికి. ఏమిటో రఘు వస్తాడనగానే మనస్సు మహానంద పడి పోతుందే. అసలు వాడెలావున్నాడో? తన పెళ్ళికొచ్చినపుడే ఆఖరి సారిచూడ్డం. పెళ్ళిలో తనకు చిన్న ప్లాస్టిక్ పాపను పెద్దగాపాక్ చేసి చదివించాడు. అది చూసే సరికి అందరికి ఒకటేనవ్వు. బలేచలాకీ అయిన వాడు. వాడి పెళ్ళికి తను వెళ్ళలేక పోయాడు. పెళ్ళయిన తరువాత యిప్పుడెలా మారాడో? వాడికి బోండాలంటే బలేమోజు. మజాగా తినిపించేయాలి. భారతిచేత మైసూర్పాకు చేయిస్తాను. వాడు వచ్చినవెంటనే ఆఫీసుకు సెలవుపెట్టేస్తాను. హాయిగా వూరంతా షికార్లు కొట్టచ్చు. వూహలతో పైకెగిరి పోతున్నాడు.

ఊహ అలా ఎగరకుండా హఠాత్తుగా మలుపుతిరిగి మరొక సందులోకి పోయింది. అన్నట్లు డబ్బు, అది ఆలోచించాల్సిన విషయమే. తన వెధవగుమాస్తా ఉద్యోగాన్ని అనుకోవాలి ముందు. ఉద్యోగాన్ని అనుకొని ఏమి ప్రయోజనం తను చదివిన బి. యస్.సి. కింతకంటే పెద్ద ఉద్యోగం వచ్చి ఏడుస్తున్నదంటే ఈ రోజుల్లో అదిగాక నెల చివరిరోజులు. తనదగ్గర 5 రూపాయలు మాత్రమే వున్నాయి. భారతి రేపు ఆదివారమండీ, సిని

మాకు తీసుకెళ్ళండి. అంది తనపని ఖాళీచేసి. అసలీ ఆడవాళ్ళమాటల్లో బలే టెక్నిక్ వుంది. ప్రాధేయపడి అడుగుతున్నట్లే అడిగి, పనులు చేయించుకుంటారు. అది మాని మనం అనుకుంటాము. స్త్రీల ఉద్దేశాలలో కూడ బానిసత్వము గూడు కట్టుకుపోయిందని, కాని వాళ్ల మాటలలో వున్న దాస్యము భావంలో లేదు. వాడు ఆ రఘూగాడొస్తే ఎలా? డబ్బులేక పోయినప్పుడు ఎలా? ఏం చేసేది? గబుక్కున దిగులుపడిపోయాడు.

దిగులుపడి మళ్ళీ గుబుక్కుని యింకో ఆలోచనలో పడిపోయాడు.

ఈ విషయంలో భారతి సలహా అడిగితే 'కార్యేషు మంత్రి' అని. యింకేమో అని భార్యను వర్ణించడం ఎక్కడో చదివాడు తను. అలా మంత్రిలా తనకు సలహా యిమ్మంటే, ఏమంటుంది? నే నిప్పుడు చారులో చింతపండు పడెయ్యాలి. మీకు సలహా యివ్వడానికి సందు లేదంటుందా? సలహా యిస్తుందనుకో పోనీ, సలహాను పాటించడానికి తనే చావాలి. సలహాతో పాటు చక్కగా ఒక డబ్బులమూట వరంలా లభించగూడదు. వెధవది అలా డబ్బులు లభిస్తే అంతా ధనవంతులై పోరూ నా మతి మండిపోనూ! ఛ, ఛ నేనెందుకు అనవసరంగా మండడం? నా తెలివి తెల్లారినట్లే వుంది. ఇలా ఆలోచిస్తుంటే నా తెలివి కాకపోయినా, తెల్లారట మాత్రం నిజం, అనుకుంటూ చక్కగా శయనించాడు.

రాత్రి అవ్వడం ఆలశ్యం చక్కగా తెల్లారింది వెంటనే: పనిమనిషి వచ్చింది. 'అమ్మగారో, అమ్మగారో' గావు కేకలు పెట్టింది. ఆ అరుపులు భారతికి వినపడలేదుకానీ. బాబిగాడికి బాగా వినిపించాయి. వాడు లేచాడు ఏడుపుతో. అది భారతి పాలిటి మేలుకొలుపు. సైరనులా చెవులదగ్గర ఆ దేపనిగారోదన చేస్తుంటే లేవకేం చేస్తుంది లేచి, తలుపు తీసి, బాబిగాడ్ని జోకొట్టి పనిమనిషికి అంట్లు వెయ్యడాని కళ్ళింది. దానితో తెల్లవారింది ఆ యింట్లోను, అందరికీ తెల్లవారినట్లే.

ఆ ఆదివారం అలా అలా గడుస్తూ, సాయంత్రం నాలుగయింది. భారతి కాఫీ అందించటానికి వచ్చింది. 'ఏమండీ! ఆదివారం సినిమాకు తీసుకెళ్తానన్నారు, తీసుకెళ్ళరూ?' గోముగా అడిగింది. మూర్తి మనస్సులో టపాకాయ టప్ మని ప్రేలింది.

'తప్పదా?'

'ఎందుకు తప్పుతుంది మాటిచ్చిన తరువాత?'

'మరి...మరి...'

'ఏమిటూమరి?'

'మరి, రఘూవాళ్ళు వస్తే ఎలా?'

'ఏమ్మిటెలా? రఘువాళ్ళొస్తే...'

'వస్తే, వాటికని, వీటికని డబ్బు కాస్త కావద్దా. నా దగ్గరున్న ఐదు రూపాయలు నీ సినిమాతో ఆరిపోతే ఏం చేస్తాం?' సంశయం వెలిబుచ్చాడు.

'ఏంచేస్తాం? భోంచేస్తాం.'

'ఏం అప్పటిదాకా భోంచెయ్యమా?' అనుమానం.

'అదికాదు.'

'కానిదెందుకు, అయినదే చెప్పు.'

'మీరు ఐదు రూపాయలతోనే అతిథిమర్యాదంతా చేసేటట్లు మాట్లాడుతారే. ఓ పాతిక ఎక్కడన్నా అరువు పుచ్చుకోండి. చక్కగా పబ్బం గడుపవచ్చు.' ఇంతదాకా మీకీ ఆలోచనే రాలేదా అన్నట్లు మాట్లాడింది.

'సరే, అలాగే వెడదాం', నీరసంగా నెమ్మదిగా అన్నాడు.

'మీకంత కష్టమయితే ఎందుకులెండి', అన్నది బెట్టుగా. నాకోసంకాదు, నీకోసమే నేను సినిమాకొస్తున్నా, అన్నట్లుగా.

'వెళదామంటున్నాగా, తప్పక వెడదాం' ఓటమి ఒప్పుకున్నాడు. సినిమా తతంగం పూర్తిఅయింది, ఐదు రూపాయల ఆముదంతో, గిర్రున తిరిగి మరుసటిరోజు వచ్చేసింది. ఆఫీసుకెళ్ళే హడావుడిలోనే రఘు వచ్చే రోజును గుర్తుచేసుకొన్నాడు. లెక్కవేసి చూస్తే మరుచటిరోజు పొద్దుటే వస్తున్నాడని తేలింది. పాతిక రూపాయలు అరువు. బాబోయ్, ఎవడిస్తాడు. ఎవడిని పట్టుకు దేవుళ్ళాడను. అనుకొని అతలాకుతలం అయిపోయాడు ఆఫీసుకెళ్ళాడు ఎవడినడిగితే డబ్బిస్తాడా అని కానేపాలోచించాడు.

హెడ్డు గుమస్తా వాడు జీతం వచ్చిన మరునాడే గడ్డుగా వుందంటూ అప్పుకు బయలుదేరుతాడు జిడ్డుగాడు. అడగకుండా వుండటమే ఎంతో మంచిది. ఆ

(తరువాయి 62వ పేజీలో)

(56వ పేజీ తరువాయి)

రామారావుగాడ్ని, రఘుపతిని, శేఖరాన్ని, ఊహు వీళ్ళెవరూ లాభంలేదు. ఆ బ్రహ్మచారి బ్రదయ్యగాడ్ని అడిగితే? సరే, అడిగిచూద్దాం మనసొప్పేసింది అనుకున్నాడు.

సాయంత్రం యింటికెళ్తున్నపుడు అడిగేద్దామనే అనుకున్నాడు. వెదవ మొహమాటం అడ్డొచ్చింది. అడ్డొచ్చిన మొహమాటాన్ని ఆకళంగా తిట్టేసాడు. తిట్టితే నాకేమిటిలే నీ మంచికోసమే చెబుతున్నాను అంది కొద్ది దూరంపోయి. వెనక్కి తిరిగి చూడకుండాపొమ్మని తరిమి. బద్రయ్యదగ్గర కెళ్ళాడు. ఏమయితేనేంలేం అని అడిగేసాడు. లేదని బల్లుమని తలుప పడేలుమని వేసినట్లు చెప్పేసాడు. వెధవ; వెదవన్నర వెదవ, నా అంతటి వాడు అప్పు అడిగాడనన్నా మర్యాద వుంచాడా? అసలు నే నడిగినందుకే అలా అలా డబ్బు గలగలా మనేట్లు గుమ్మరించవచ్చునే. అని వాడిమీద మండి పడ్డాడు మనస్సులో. అప్పుడే ఒక ముష్టివాడు వెంట పడ్డాడు. పోవోయ్, కస్సుమన్నాడు వాడు సణుక్కుంటూ పోయాడు.

మూర్తికి కోపంతో వళ్లు మండిపోయింది. అయినా వాటరులో స్నానం చెయ్యమని సలహాయిచ్చే స్నేహితులెవరూ ప్రక్కన లేకపోవడంతో, కాసేపట్లో చల్లపడ్డాడు. మరి కొంచెంసేపట్లో అప్పుకోసం ఆలోచనలో పడ్డాడు. మెరుపులా మెదడులో కొచ్చి పడ్డాడు. మృత్యుంజయుడు వాడ్ని అడిగితే ఏమ[illegible]లాభం వుంటుందని గబగబా వెళ్లాడు. వాడింట్లో లేడు. తిన్నగా యింటికిపోయి మళ్ళీ కాసేపు పోయినతరువాత తిరిగి వచ్చాడు. మృత్యుంజయుడు ముచ్చటగా కనపడ్డాడు. ఆపద్బాంధవుడులా ఆదుకోవాలి తెలుసా అని అవసరం గూర్చి చెప్పాడు. రేపు ప్రొద్దుటికే అవసరం అన్నాడు. వాడు రేపొద్దున్నరా, ప్రయత్నించి చూస్తానన్నాడు. మూర్తి కాళ్ళీడ్చుకుంటూ యిల్లు చేరుకున్నాడు. మరుచటినాడు వస్తే, మృత్యుంజయుడు మాట తప్పకుండా, డబ్బు యిచ్చాడు. వాడ్ని ఆమాంతం ఆకాశాని కెత్తాలని, పొగడ్తలతో ముంచెయ్యాలని అనుకున్నాడు. డబ్బెలాగో యిచ్చి యీ తద్దినం ఎందుకుకొని తెచ్చుకొన్నానురా అని అనుకుంటాడని పూరుకున్నాడు. డబ్బు తీసుకుని పరుగుపరుగున పోయాడింటికి.

భారతికి తన ఘన విజయం చెప్పేసాడు. ఆవేళ ఆఫీసుకు సెలవే అన్నాడు. అంటే తనే సెలవుపెట్టాడన్నమాట. ఆనందంతో అదీ యిదీమాట్లాడుతూ, చక్కగా ముస్తాబయ్యాడు. ముందు బజారుపోయి వస్తా, కావలసినవి చెప్పమన్నాడు. డబ్బు చూసుకుంటేలేదు, గాబరా పడ్డారు. గాబరాపడితే ఎలా అనుకుని గాబరా పడ్డం ఆపి వెతకడం ప్రారంభించాడు. ఎక్కడైనా కనబడితేనా? అదే ఎలా మాయమయిందని మదనపడ్డాడు. చూసుకుంటే జేబుకు కన్నం. డబ్బుపోయిందని తెలియగానే నీరసంగా కూలపడ్డాడు.

భారతి తన్నొకదద్దమ్మ క్రింద జమకడుతుందేమోనని బాధపడ్డాడు. ఇప్పుడేం చెయ్యాను? రఘువస్తే ఎలా? కానీ లేకుండా కాలక్షేపం ఎలా చెయ్యాలిరా, భగవంతుడా? ఈపాటికి ట్రయిను వచ్చేసివుంటుంది. ఇంకాస్సేపట్లో రఘు యిక్కడికొస్తాడు. ఈ లోపుగా తనకు డబ్బెక్కడ దొరుకుతుంది? అనుకుంటూ సీరియస్‌గా ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఎవరో వస్తున్నట్లు చప్పుడయింది. ఇంకేముంది, వచ్చేసాడు గాబోలు అనుకున్నాడు. వెళ్ళిచూడ్డానికి కూడా సత్తువలేక కదల్లేదు. భారతిపోయి తలుపుతీసింది. కాస్సేపు పోయిన తరువాత తిరిగి వస్తున్నట్లు అడుగుల చప్పుడు బట్టి తెలుసుకున్నాడు.

'ఉత్తర మొచ్చింది, చూసుకోండి' అంటూ అందించింది.

'ఉత్తర మొచ్చి ఏముద్ధరిస్తుందిలే' అంటూ అందుకున్నాడు. అప్రయత్నంగానే దాన్నిచూసాడు. రఘు వ్రాసినట్లుందే అనుకున్నాడు. కొద్దిగా కుతూహలం మొచ్చింది, చదివేసాడు. 'భారతీ! రఘు రావటం లేదు' గావుకేకలు పెట్టాడు.

'రాకపోతేపోనీగాని గట్టిగా అరవకండి బాబు' అంది, ఇందాకటినుంచి మూర్తి అవస్థ చూస్తున్న భారతి.

అరవడం ఆపేసి, పోనీలే రఘు రాకపోవటం మన మంచికే వచ్చింది. వెదవ అతిథిరాకపోతె మానె అనవసరంగా పాతిక ఆముదం అయిపోయాయే, అవితను వచ్చే నెలలో తీర్చాలి. అనుకుంటూ పోయినపాతిక రూపాయల గూర్చి ఆలోచించుకుంటూ, రాని అతిథిని తిట్టుకుంటూ కూర్చున్నాడు. ఏమయితేనేం అతిథి ఆగమనం ఆగిపోయింది.